

# ప్రతిపక్షి ప్రత్రుడు

ఎస్.కె.రామారావు



ముఖ్యమంత్రీ విద్యామంత్రీ కులాసాగా కబుర్లు చెప్పుకుంటున్న గదిలోకి పిల్లి పాలగిన్నె మీద దూకినట్లు దూకాడా ప్రతిపక్షనేత. అధాటున ఆపదొచ్చినట్లు ఉలిక్కిపడి, తేరుకున్నారు. ముఖ్యమంత్రికి కోపం నసాళానికి అంటింది. "ఏమిటిది ప్రతిపక్షా! అనుమతీ గట్రా లేకుండా ఇలా రావటం సభ్యత కాదని తెలియదా? మాలో మేము మా పార్టీ విషయాలూ ప్రభుత్వ పాలసీలు మాట్లాడుకుంటుంటాం. అవి నువ్వు వినొచ్చా? ఏళ్ళు వచ్చాయి కానీ బుద్ధి రాలేదే నీలా ఇట్లారావటం మా ఇంటావంటా లేదు."

"ప్రతిపక్షా ఏమిటి? అధ్యక్షా మాదిరిగా అదేం పిలుపు?"

"అలానా అయితే ఈ క్షణం నించి ప్రతిపక్షీ అని పిలుస్తాను. ఇష్టమేనా?" అంగీకారం కోరాడు ముఖ్యమంత్రి.

"నీ ఇష్టం వచ్చినట్లు పిలుచుకో కానీ చేయవలసిందంతా చేసి ఇట్లా ఇద్దరే కూర్చుని నంగనాచి కబుర్లు చెప్పుకోక మరేం చేస్తారు? మీ ఇద్దరి సంగతి రేపు సభలో పెట్టి బండ బాదుడు బాదుతా. పబ్లిగ్గా మీ అవినీతి కార్యక్రమాలు మీ కక్షసాధింపు ధోరణులు ఎండగడతా." రోషంగా హుంకరించాడు ప్రతిపక్షి. ముఖ్యమంత్రికీ విద్యామంత్రికి ఒక్క క్షణం ఏమీతోచలేదు.

"విద్యా మనం చేసిన పనులు మనం చేయబోతున్న పనులు ఇంకా ప్రజలకి తెలియనివి ఏమున్నాయబ్బా?" విస్మయంగా విద్యామంత్రి కేసి చూశాడు.

"ఉండి ఉంటాయి సార్. ఈడి ముఖం చూస్తే ఏదో మనమూ–జనమూ మర్చిపోయింది వీడికి ఇప్పుడు తట్టి వుంటుంది." అన్నాడు.

"అదేదో ముక్కుసూటిగా చెప్పి పదోపరకో కావాల్సి వస్తే అడిగి చావచ్చుగా! ఇట్లా ఈ దాగుడుమూతా దండాకోర్" ఆటలు ఆడే టైమా ఇది" ముఖ్యమంత్రి విసుక్కున్నాడు. ప్రతిపక్షనేత ముఖంలో కొత్త నేరాలచిట్టా విప్పబోతున్న ఉత్సాహభరిత వాతావరణ సూచనలు కనిపించగానే ముఖ్యమంత్రి కాస్త తగ్గాడు.

‘‘ప్రతిపక్షీ ఇప్పుడు మరి మా అధికార పార్టీ చేసిందేమిటో అది నీకు ఎట్లా కష్టం కలిగించిందో మరి కాస్త చెప్పు నాయనా. చచ్చి నీ కడుపున కవల పిల్లల్లా పుడతాం అని హామీ ఇస్తా.’’ విద్యామంత్రి మరీ ఇదయిపోయి కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

ప్రతిపక్షీ గొంతు సవరించుకుని మళ్ళీ కంఠం రుద్ధమవుతుండగా ‘‘మా చంటి మళ్ళీ ఇంటర్ తప్పాడు. అదీ తెలుగు సబ్జెక్టులో మావాడి పరీక్ష పోవటం వెనుక మీ ఇద్దరి ప్రచ్ఛన్న హస్తం వుందని యావద్భారత ప్రజలకు చాటి చెప్పబోతున్నాను. అంటే కేవలం ఇంకో గంటలో పత్రికలకెక్కబోతున్నాను.’’ ముఖ్యమంత్రికి చిర్రెత్తుకు వచ్చింది.


‘‘పో- బే- పో. పత్రికలకే ఎక్కుతావో, టివీలకే ఎక్కుతావో, నీవే చావు చస్తావో నువ్వే చావు. అయిందానికి కానిదానికి మమ్మల్ని బదనాం చేయకు. నీ మొద్దుముండాకొడుకు చదువుకోక పరీక్ష తప్పితే అది దేశసమస్యా! ప్రజలకు చెప్పుతావా’’ ఊపిరిపీల్చుకోవటానికి ఆగి మళ్ళీ మొదలెట్టాడు.

‘‘ఒక్క సంగతి గుర్తుంచుకో లేపేయదల్చుకుంటే నిన్నే లేపేసి మాకూ ఈ దేశానికి నీపీడా వదిలించటం మంచిది కదా! కానీ ముక్కుపచ్చలారని మీ చంటిని ఎందుకు ఫెయిల్ చేయిస్తామయ్యా!’’ నీ మైండుకూ నీ మాటకు కోఆర్డినేషన్ లోపించిందయ్యా. నిమ్స్‌కు ఫోన్ చేస్తా ఒకసారి వెళ్ళి చూపించుకో ఎందుకయినా మంచిది.’’ ముఖ్యమంత్రి ఆగ్రహించినా ప్రతిపక్ష మానసిక ఆరోగ్యంపట్ల తగు మాత్రం ఆందోళన వ్యక్తం చేశాడు.

ప్రతిపక్షికి భయంతో వెన్నుజలదరించింది. వీడు లేపేయించినా లేపేయించగలడు. పైకి బింకంగా ‘‘ఈ విషయం అన్ని రాష్ట్రాలలోని మా ప్రతిపక్ష నేతలకి చెప్పి నీ గుండెలు బయటికి తీయిస్తా! తద్వారా గుండెలు తీసిన బంటని బిరుదు సంపాయిస్తా.’’ అంటూ ఒక వూపు వూపి చూడబోయాడు. ముఖ్యమంత్రి మటుకు విలాసంగా ఒక నవ్వు నవ్వి ‘‘ప్రతిపక్షీ ఈ దేశంలో ఎన్నిరాష్ట్రాలున్నాయీ, వాటిల్లో మీ పార్టీ వాళ్ళు ఎన్నిచోట్ల అధికారంలో వున్నారూ, ఎన్నిచోట్ల ప్రతిపక్షంలో వున్నారూ కాస్త చెపుతారా? నా గుండెల సంగతి తర్వాత’’ ప్రతిపక్షి కంగుతిన్నాడు. అతనికి ఈ దేశంలో ఎన్ని రాష్ట్రాలున్నాయో తెలియదు. నిజానికి విద్యామంత్రికి కూడా రాష్ట్రాల సంఖ్య తెలియదు. ముఖ్యమంత్రి తననెక్కడ అడుగుతాడోనని కళ్ళు మూసుకుని గంభీరంగా ‘జనగణమన’ గీతం కళ్ళముందు వూహించుకుంటున్నాడు. రాష్ట్రాల సంఖ్యకోసం భయానికి చరణాలు వరసగా గుర్తుకు రావటం లేదు. ‘‘ప్రతిపక్షీ ఇవన్నీ ఎందుగ్గానీ మీ అబ్బాయి పరీక్ష తప్పటం వలన మాకు వచ్చిన లాభం ఏమిటో మేమే ఆ పని చేయించామనటాన్కి నీ దగ్గరున్న ఆధారాలేమిటో చూపించి మాట్లాడితే బాగుంటుంది. ముఖ్యమంత్రి సలహా ఇచ్చాడు. ‘‘మీరు తెలుగు పేపరు చాలాక్లిష్టంగా ఇప్పిస్తున్నారు. మీరు మా వాడిని టార్గెటుగా పెట్టుకున్నారు. మావాడికి కంప్యూటరొచ్చు. వెధవ తెలుగే పాసుకాలేడా ఇది యావత్ మీ మంత్రి మండలి చేసిన కుట్ర- పన్నినపన్నాగం. ఒక భావి మేధావిని, ఒక కాబోయే జాతిరత్నాన్ని మొగ్గలోనే తుంచెయ్యటం కాకపోతే..’’ ప్రతిపక్షి కాస్త ఆగాడు.

మళ్ళీ అదే బుద్ధిలేని కూత. మీకుర్రాడు ఈసారి ప్యాసు కావాలి. అంతేగా! వుండు జటాయువును పిలిపిస్తా.’’

జటాయువంటే ఎవరైనా హంతకుడి ముద్దు పేరేమోనని ప్రతిపక్షికి ముచ్చెమటలు పోశాయి. మళ్ళీ బింకంగా ‘‘పిలిపించండి. జటాయువంటే మనిషా లేక పక్షి సంతతికి చెందినవాడా...’’ అనుమాన నివృత్తికి గాను అడిగాడు.




‘‘డార్విన్ సిద్ధాంతానికి రుజువుగా నువ్వున్నావు. కాని జటాయువు పక్షికాదు. మనిషే చాలా పెద్ద ఆఫీసరు ప్రస్తుతం మాకు విశ్వసనీయుడు. అధికారంలో ఎవరుంటే వాళ్ళకు విశ్వాసపాత్రుడని గిట్టనివాళ్ళంటారు.’’

‘‘ఆఫీసర్ అంటే సిబిఐ ఆఫీసరా’’ ప్రతిపక్షి కొంచెం సందేహంగా అడిగాడు. అతనికి ఆ జాతి ఆఫీసర్లంటే ఎందుకో ఎలర్జీ. ‘‘అబ్బే వాడు కాదు. వాడయితే మేం ఎందుకు పిలిపిస్తాం.’’ మాకుమటుకు భయంవుండదా! అన్నాడు విద్యామంత్రి. ‘‘జటాయువు విద్యాశాఖా సంచాలకుడు. ‘‘విద్యా జటాయువుకు ఫోను కొట్టు.’’ ఆదేశించాడు ముఖ్యమంత్రి. పదే పదినిమిషాల్లో జటాయువు వాళ్ళు ముందున్నాడు. సంగతంతా విని ‘‘దాందేముంది. సప్లిమెంటరీ పరీక్షలు ఆర్నెల్లకోసారి బదులు మూణ్ణెల్లకోసారి పెట్టిద్దాం. ప్రభుత్వానికి పరీక్ష ఫీజుల ద్వారా కొంత రాబడి వుంటుంది. పై పెచ్చు ప్రతిపక్షి పిల్లలూ, మనమంత్రుల పిల్లలూ అంతా పరీక్ష గండం గడిచి రిజల్టు పిండాలు బయటేసుకోవచ్చు.’’ జటాయువు తన ప్రతిపాదనని వినిపించి ప్రశంసకోసం ప్రతిపక్షికేసి చూశాడు. ఆ ప్రతిపాదన ముఖ్యమంత్రికీ, విద్యామంత్రికీ నచ్చిందికానీ, ప్రతిపక్షి మొహం ఇంకా విచ్చుకోలేదు. ‘‘పరీక్ష పేపరు సులభంగా ఇవ్వాలి కానీ, పరీక్షనెలకొకసారి పెడితే మాత్రం ఏం సుఖం?’’ తన అసంతృప్తి వ్యక్తం చేశాడు.

‘‘ఓస్ ఇంతేనా పరీక్ష పేపరు చాలా ఈజీగా ఇప్పిద్దాం. అఆలు మాత్రమే వచ్చిన ప్రతి వెధవ ముండా... వాడు మీ అబ్బాయితో సహా అలవోకగా రాసేలా పేపర్లిప్పిద్దాం.’’ తెలుగు పండితోత్తముడు కమఠాచార్యులను ఇప్పుడే పిలుస్తా.’’ అంటూ జటాయువు ఫోను మీద చేయిచేశాడు. ప్రతిపక్షికి జటాయువు ధోరణి నిరంకుశంగా కనిపించింది. సలహాలు సంప్రదింపులు లేకుండా నిర్ణయాలు ఏకపక్షంగా తీసుకుంటున్నాడు. ‘‘ఏమాచార్యులు ఏమి పేరది?’’ ప్రతిపక్షి సందేహంగా అడిగాడు. ప్రతిపక్షంలో పడ్డప్పటినుంచీ తను దేనినీ దాని ముఖవిలువ మీద నమ్మటం మానేశాడు. లోకం ఎట్లాపోతే నాకేం నేనూ నా ఇంటిది నా చంటాడు బాగుంటే చాలు అనుకొనేస్థాయికొచ్చాడ తను.

‘‘కమఠాచార్యులు కమఠం అంటే తాబేలన్నమాట. ఇతని తల్లి తండ్రులకు ఇతను లేకలేక పుట్టాడు పైగా పుట్టిన కొద్ది రోజులదాకా ఇతని తల వుండి మాయమై చూపరులను ఆశ్చర్య భయాందోళనలకు గురిచేసి కాస్సేపటికి మొండెంనించి బయటికి వచ్చి తన ఉనికిని అస్తిత్వాన్ని చాటుకొనేదట. తాబేలు లక్షణాలు కలవాడు కదాని కమఠాచార్యులని పేరు పెట్టారట. అద్భుతమైన పేరు. సార్థకమయిన పేరు ఫెంటాస్టిగ్గా వుంది కదూ. అదిరింది కదా.’’ జటాయువు ఆనందంగా అడిగాడు.

‘‘నీ బొందపేరు. నీబోకిపేరు. నువ్వు జటాయువు వాడు కమఠం ఏడ్చారు. కానీ.. ఊ త్వరగా పిలిపియ్యి వాణ్ణి’’ ప్రతిపక్షి విసుక్కున్నాడు. ఈ రెండుపేర్లూ బాగేలేవని తన అభిప్రాయం నిర్మొహమాటంగా నిర్ద్వంద్వంగా ప్రకటించాడు. జటాయువుకు అరికాలిమంట నెత్తికెక్కింది. ప్రతిపక్షి మూతి మీద ఈడ్చితందామా అని కాలును నేలకు రాపాడిస్తూ క్రీగంట ఏకోణం నుంచితంతే బాగుంటుందని పరిశీలిస్తున్నాడు. సంగతి సకాలంలో గ్రహించిన ముఖ్యమంత్రి ప్రమాద నివారక చర్య చేపట్టి ‘‘జటా! కమఠిని పిలిపించు’’ అని సందేశించాడు. అయిష్టంగానే తర్వాతి కార్యక్రమం ఆరంభించకముందే ఆగిపోయినందుకు చింతిస్తూ కమఠాచార్యులకు ఫోను చేశాడు. కమఠాచార్యులు వచ్చీరాగానే తల మొండెంలోకి లాక్కుని సభికులంతా ఆశ్చర్యంతో చూస్తుండగా మళ్ళీ బయటికి తెచ్చాడు. ‘‘అలా చేయటం ఇక్కడున్న అందరికీ ఏకకాలంలో నమస్కారం చేయడమన్నమాట.’’ జటాయువు ఆ ప్రక్రియకు అర్థం వివరించాడు.

"ప్రతినమస్కారం చేద్దామంటే మన తల అలా సహకరించదుగా ఎలా చచ్చేది?" ప్రతిపక్షి తలపట్టుకొన్నాడు. మనలో మనకు మర్యాదలెందుకని వారిస్తూ జటాయువు సమస్యతీవ్రతను కమతాచార్యులకు వివరించి ప్రశ్నాపత్రం సులభంగా వుండాల్సిన ఆవశ్యకతను నొక్కి వక్కాణించాడు. " ఓస్ అదెంతసేపు. చాలాసులభంగా ఇస్తాను. ఉదాహరణకు "తెలుగుభాషలో అక్షరములెన్ని వర్ణక్రమమును వివరింపుము." అని అడుగుతాననుకోండి. అది చాలా సుల..." కమతాచార్యులు మాట పూర్తికాకుండానే ముఖ్యమంత్రి, విద్యామంత్రీ ప్రతిపక్షి జటాయువు కోరస్‌గా ఆర్తనాదం చేశారు. "వద్దు అవెన్నో మాకే తెలియదు. పాపం ఇంటర్ చదివే చంటి వెధవకు ఏం తెలుసుద్ది."

"స్వస్తి స్వస్తి పోనీ అలా కాకుండా తెలుగు భాషలో అచ్చులెన్ని హల్లులెన్ని అనడగనా?"

ఈసారి ప్రతిపక్షి కమతాచార్యుల కాళ్ళు పట్టుకొని కన్నీళ్ళతో నింపేశాడు. తన కొడుకు సంగతేమిటో గాని ఇలాంటి ఖతర్నాక్ ప్రశ్నలడుగుతే తాను ఆత్మహత్య చేసుకుని దానికి బాధ్యుడు కమతాచార్యులేనని సూసైడు నోటు రాసిపెట్టి మరీ పోతానని బెదిరించాడు.

"ఎలాగబ్బా" ఒక్క క్షణం ఆలోచించి "అద్గదీ రామాయణం కథ అందరికీ తెలుసు పైగా అది నాన్ డిటెయిల్డుగా కూడా వుంది. పైపెచ్చు రామాయణం పాఠాలు ప్రతిక్లాసు టెక్ట్స్ బుక్కులో ఏదో ఒక ఘట్టం నుంచి వున్నాయి. కాబట్టి ఆరుప్రశ్నలు రామాయణం నుంచి ఇస్తాను. ఒక్కొక్క ప్రశ్నకు మూడు జవాబులుంటాయి. చంటిలాంటి వెధవనాగన్నలు సరయిన జవాబుమీద టిక్కుపెడితే చాలు పేజీలు పేజీలు హైరానాపడి రాయనక్కరలేదు."

ఈ సూచన అందరికీ నచ్చింది. తన కొడుకును వెధవనాగన్న అన్నందుకు ఇసుమంత కోపం వచ్చినా తమాయించుకొని "మావాడు మరీ వెధవనాగన్న కాడండీ వాడికి కంప్యూటరొచ్చుద్ది." ఉక్రోషంగా అన్నాడు ప్రతిపక్షి.

"బాగుబాగు మేలుమేలు శుభాంభూయాత్" అన్నాడు కమతాచార్యులు. ప్రతిపక్షి కమతం కేసి ఇంకా అనుమానంగా చూస్తూ "తేలికప్రశ్నలిస్తావా లేక నీ పైత్యపు పాండిత్యాన్ని ప్రదర్శిస్తావా. నీమీదా జటాయువు మీదా నాకు సదభిప్రాయం కలగటం లేదు వెధవలు అధికారంలో వున్నవాళ్ళకి వంతపాడతారు." అన్నాడు.


ఈసారి జటాయువు మనసుకు ఏదో అజ్ఞాత శక్తి "వాడి మూతిమీద ఎగ్గిరి తన్ను" అని దివ్య సందేశాలు పంపిస్తున్నది. ఆ దివ్యసందేశాల తీవ్రత తట్టుకొని తన్నకుండా తన్నుతాను నిగ్రహించుకోవటం దాదాపు అసాధ్యంగా భావించి జటాయువు తిరిగి ఏ వూపుతో తంతే బాగుంటుందా అని ఆలోచిస్తున్నాడు. మళ్ళీ ముఖ్యమంత్రే అతణ్ణి వేరేపనికి పురికొల్పాడు.

"ముఖ్యమంత్రీ మావాడు తెలుగులోనే వీకే కానీ వాడికి కంప్యూటరొచ్చుద్ది."

"నిన్నూ, నీ చంటాడిని, వాడి దిక్కుమాలిన కంప్యూటర్‌నూ, బొందలో వేసి నిలువెత్తు కప్పెట్టి నిప్పుపెడతాను. ఒక్కనిమిషం ఇక్కడ వున్నా ఖబడ్దార్" ఆగ్రహం ప్రదర్శించాడు ముఖ్యమంత్రి.

ముఖ్యమంత్రి మొహం చూస్తూ శ్రీవారికి తిరువళ్ళం తీవ్రంగా భారమైంది. అనుకుంటూ కమతాచార్యులు నిష్క్రమించాడు.

ప్రతిపక్షి కారులో ఇంటికిపోతూ ఆలోచిస్తున్నాడు. ఈసారి చంటిని ప్యాసు చేయించలేకపోతే ఇంటిది విడాకులు ఇస్తానని మంకు పట్టుపట్టింది. పైగా తనకూ తన పార్టీలోని మస్తానమ్మ ఎలియాస్ మస్త్‌కుమారికి అక్రమసంబంధం వుందనే నగ్నసత్యాన్ని లోకం నలుమూలలా చాటిస్తానని భీషణ




ప్రతిజ్ఞ చేసింది. ఇదే జరిగితే తన పేరూ ప్రతిష్టలు ఏం కావాలి. చంటి విషయం చూద్దామా అంటే వాడూ వాడి స్నేహితులు, మందూ పేకాటా, కంప్యూటర్ తప్ప వేరే లోకం ఎరుగడు పాపం పసినాగన్న. ఈ వయసులో కాకపోతే ఏ వయసులో సుఖపడతాడు.కాకపోతే పుస్తకం మట్టుకు ముట్టడు. పదోతరగతి వరకు బాగానే చదివాడు. ఈ ఇంటర్ లోనే నాలుగుసార్లు అదీ తెలుగు సబ్జెక్టులోనే ఫెయిలవుతున్నాడు. ఈసారి ప్యాసుకావాలి. గోమతాచార్యులు కాదు..కాదు వీణ్ణి బొందపెట్ట పేరు కూడా గుర్తుండటం లేదు. ఏం పేరది? ఆ కమతాచార్యులు... పేపరు సులభంగా ఇస్తానని వాగ్దానం అయితే చేశాడు. కానీ అధికారపార్టీ, దాని అనుయాయ అధికారుల వాగ్దానాలు నమ్మటం మంచిది కాదు. అధికార పార్టీని ఏ రకంగా భయపెడదామన్నా, ముఖ్యమంత్రి దగ్గర తన పప్పులు ఉడకవు. అతను జగజ్జంత్రి, మోసగాళ్ళకు మోసగాడు తన వూపులన్నీ ఉడత వూపులే. చంటిగాడు ఈసారి కనుక ప్యాసుకాకపోతే అసలు పీకులాట ఇంటిదాంతో వస్తుంది. నిరంకుశంగా వ్యవహరించే వాడిని నియంత అనవచ్చు. నియంత స్త్రీ అయితే ఏమంటారు? నియంతి అనవచ్చా ఏమో తెలుగు సరిగ్గా వచ్చి చావదు. ఈసారి చంటిప్యాసుకాకపోతే ఇంటిది విడాకులివ్వక వూరుకోదు. తన ఇమేజ్ దెబ్బ తింటుంది. తను రాష్ట్ర రాజకీయ చిత్రపటానికి కొత్త రంగులు దిద్దాల్సి వస్తుంది.

అదే సమయానికి విద్యామంత్రి కారులో పోతూ ఆలోచిస్తున్నాడు. తను చిన్నతనంలోనే చదువు చాలించి సినిమాహాళ్ళల్లో బ్లాకులో టిక్కెట్టమ్మాడు. ఆ వృత్తిలో పోలీసోళ్ళతో చాలాసార్లు దెబ్బలు తిన్నాడు. తప్పనిసరి పరిస్థితుల్లో ఒక హత్య చేసి దాని మాఫీ విషయంలో ఒక రాజకీయవేత్తనాశ్రయించి, పార్టీ కార్యకర్తగా మారి అంచెలంచెలుగా ఈ స్థితికొచ్చాడు. తనకు చదువులేకున్నా విద్యామంత్రి కాగలిగాడు. ఎంత చదివినోడైనా తనంత సంపాదించగలడా? కానీ ప్రతిపక్షితోనే సమస్య వచ్చింది. అతడికి తన గతం తెలియదనుకొన్నాడు. ఒక కాలేజీడే సందర్భంగా తనూ అతనూ ఒకే వేదిక మీద నుంచి మాట్లాడవలసి వచ్చింది. అతనేమో ఆ సందర్భంగా తన ఉపన్యాసంతో " కొందరు బ్లాక్‌మనీ సంపాయిస్తారు. మరికొంతమంది వైట్ మనీ సంపాయిస్తారు. కొందరేమో బ్లాక్ అండ్ వైట్ సినిమాలు తీస్తారు. కొందరు కలర్ సినిమాలు తీస్తారు.'' ఇలా సందర్భంగా మాట్లాడుతుండగా తాను కుర్చీలో వణికిపోతూ ఆపాదమస్తకం కంపిస్తున్నాడు. వళ్ళంతా జ్వరంపాకింది. ఇంతలో ప్రతిపక్షి బాంబు పేల్చనేపేల్చాడు. " కొందరేమో బ్లాకులో సినిమా టిక్కెట్లమ్ముతారు కొందరేమో కొంటారు.'' తర్వాత మాటలు తనకు వినిపించలేదు. కుర్చీలోనే స్పృహతప్పింది. మళ్ళీ ఇహలోకంలోకి వచ్చేసరికి తను ఆస్పత్రిలో వున్నాడు. కాబట్టి ప్రతిపక్షి పోరడు ఈసారి ప్యాసుకావాలి. లేకుంటే ప్రతిపక్షి తన ఇల్లు పీకి పందిరేసి పదవీ భ్రష్టుణ్ణి చేస్తాడు. ఇంటికెళ్ళి ప్రతిపక్షి ఇంటికి ఫోన్ చేశాడు. శ్రీమతి అందుకుంది. "ఏం చెల్లెమ్మా బాగుండావా మా అల్లుడు చంటి ఏం చేస్తున్నాడు?"

"ఆయన ఇంటికి రాలేదు. చంటి కంప్యూటర్ ముందు వున్నాడు. ఈ తడవ వాడు ప్యాసు కాకపోతే నేను విడాకులివ్వటం ఖాయం.'' అంది. విద్యామంత్రికి ఆలోచనొచ్చింది. చంటి ఫెయిలయితే బాగు ప్రతిపక్షి పరువు ఆనవాలు లేకుండా పోతుంది. వాడి ఉపన్యాసాలు రోడ్డు షోలు పరిస్థితిని మెరుగుపర్చలేవు. కానీ మళ్ళీ భయం వేసింది. ప్రతిపక్షి చాలా తెలివి కలవాడు. ఇంకేదో కారణం వెతికి ప్రభుత్వాన్ని పడగొట్టగల దిట్ట. ఈలోపు ప్రతిపక్షి ఫోను లైనులోకొచ్చాడు. "విద్యా నా సంగతి తెలుసుగా మనం అనుకున్నదాంట్లో తభావతు వచ్చిందా మీ పని గోవిందా.'' విద్యా దిగులుగా ఫోను పెట్టేశాడు.

పరీక్ష హాలు ముందు కారు దిగిన చంటి ముందు

సినిమాల్లో హీరోల్లా స్లో మోషన్‌లో నడవటానికి ప్రయత్నించాడు. అది కుదరక నడక చూపరులకు కప్పగంతుల్లా కనిపించింది. మామూలు నడకతో హాలు చేరుకున్నాడు. పరీక్షాపత్రం చేతికొచ్చింది. మిగతా విద్యార్థులు చంటి బయటకు ప్రకటించే జవాబుల కోసం నిరీక్షిస్తామని, తను ఏది టిక్కు పెడితే వాళ్ళూ అదే పెడతామని అతనికి తమ మద్దతు ప్రకటించారు. ఆరు ప్రశ్నలు ప్రతిదానికీ మూడు జవాబులు సరయిన దాన్ని గుర్తించి టిక్కు పెట్టాలి. మూడు గంటల వ్యవధి ఏ రెండు ప్రశ్నలకు జవాబు సరిగ్గా ఇచ్చినా ప్యాసు. కమఠాచార్యులు మాట మీద నిలబడ్డాడు. అన్నీ రామాయణం నుంచే తీసుకున్నాడు. మొదటి ప్రశ్న.

1) రామ-రావణ యుద్ధం ఎవరెవరి మధ్య జరిగింది?

ఎ) రాముడు – రావణుడు.

బి) వాలి – సుగ్రీవులు

సి) అసలెవరి మధ్యా జరగలేదు.

చంటి ఆలోచనలో పడ్డాడు. తన తండ్రి చెప్పిన ప్రకారం కమఠాచార్యులు కన్నింగ్ మేన్. యుద్ధం రాముడికీ రావణునికీ మధ్య జరిగితే ప్రశ్న ఇంత తేలిగ్గా ఇవ్వడు. ఇందులో ఏదో తిరకాసుంది. నిగూఢరహస్యం వుంది తను తెలివితక్కువ వెధవకాడు. 'ఏ' మీద టిక్కు పెట్టి ఆకులుకప్పిన గోతిలో ఏనుగుపడ్డట్లు పడటానికి! వాలిసుగ్రీవులు కూడా అవుటాఫ్ క్వశ్చన్. యుద్ధం వాళ్ళ మధ్యజరిగినట్లు తనకు నమ్మకం లేదు. మూడో జవాబు కరెక్టు కావచ్చు. రంగం అంతా సిద్ధమయిన తర్వాత యుద్ధం ఆపుకుని వుంటారు. వాతావరణం బాగాలేకపోతే ఇది మామూలే. క్రికెట్ మేచ్‌లు వాతావరణ కారణంగా వాయిదాపడ్డట్లు యుద్ధం వాయిదాపడుతుండ వచ్చు. ఈ వూహతో గుండెనిండా గాలిపీల్చుకుని 'సి' మీద టిక్కు పెట్టి 'సి' అని విజయగర్వంతో తోటి విద్యార్థులకు పిలుపునిచ్చి వాళ్ళకు మార్గదర్శి అయ్యాడు. హాలు హాలంతా 'సి' అని అరుస్తూ వాళ్ళ వాళ్ళ పేపర్లలో టిక్కుపెట్టుకున్నారు.

రెండో ప్రశ్న చూశాడు.


2. అట్లు రామునికీ రావణునికీ మధ్య జరిగిన యుద్ధంలో ఎవరు గెలిచారు?

ఎ) రాముడు

బి) రావణుడు

సి) ఎవరూ గెలవలేదు.

చంటికి ఈ ప్రశ్న పెద్ద కష్టమైన ప్రశ్నగా తోచలేదు. ఈ ప్రశ్న కమఠాచార్యుల అతితెలివికి పరాకాష్టగా తాను భావిస్తున్నానని పరీక్ష హాల్లో బహిరంగంగా ప్రకటించాడు. అసలు యుద్ధమే జరగకపోతే గెలిచేవారెవరు? ఓడేవారెవరు. కాబట్టి 'సి' సరయిన జవాబు ..సీ అని ఎలుగెత్తి తోటి అభ్యర్థులకు తాను వేగుచుక్కగా భావిస్తూ 'సి' కి టిక్కుపెట్టాడు.




హాలు హాలంతా సీ అని వంతపాడుతూ టిక్కులు పెట్టుకున్నారు.

మూడోప్రశ్న

3. అట్లు ఆ యుద్ధములో గెలిచిన అయోధ్య రాముని పట్టాభిషేకం ఏ నగరంలో జరిగింది?

ఎ) అయోధ్య

బి) కిష్కింధ

సి) ఎక్కడా జరగలేదు.

చంటిలో ఉత్సాహం వురకలు వేసింది కమఠాచార్యులు కుప్పిగంతులు తన ముందా! యుద్ధమే జరగలేదురా బాబో అంటే పట్టాభిషేకమట. తన దూరసందులేదు గానీ మెడకొక డోలట. తప్పుదారి పట్టటానికి తాను చెవిలో పువ్వుపెట్టుకోలేదు. కాబట్టి ''ఎక్కడా జరగలేదు.'' సరయిన జవాబు ఒక ఈల వేసి సీ అని అరిచాడు. హాలు హాలంతా వల్లెవల్లె అంది.

4. రాముని అరణ్యవాస కాలంలో అతణ్ణి అహర్నిశలు అంటిపెట్టుకున్న అతని తమ్ముని పేరేమి?

ఎ) లక్ష్మణుడు

బి) భరతుడు

సి) హనుమంతుడు

ఈ ప్రశ్న చంటి మనసును అతలాకుతలం చేసింది. ఉన్న కాస్త మెదడులో తుపాను చెలరేగింది. ఇది నిజంగా అగ్ని పరీక్ష విద్యామంత్రి కమఠాచార్యుల కపటం కుట్ర ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. కానీ తాను వెర్రి నాగమ్మ కాడే! కూలంకుషంగా ఆలోచించి, జవాబిస్తాడు. రాముడు మాయలేడి వెంట పరుగులు పెట్టినప్పుడు ఈ లక్ష్మణుడు అతని వెంట లేడని తన తల్లి చిన్నప్పుడు చెప్పింది. తను తల్లి మాట జవదాటడు. పైగా ఈ భరతుడున్నాడే ఇతని పేరు మీదే ఈ దేశం భారతదేశంగా మారిందట. ఇదీ తన తల్లి చెప్పిందే. తను తల్లికి సదాకృతజ్ఞుడు. ఇటువంటి జ్ఞానదేవతలైన మాతృదేవతలు ఎంత మందికి వుంటారు. తల్లిని తలచుకోగానే చంటికి కృతజ్ఞతతో కూడిన కన్నీళ్ళు వచ్చాయి. హనుమంతుడు సర్వకాలాల్లో రాముడిని అంటిపెట్టుకున్నట్లు తల్లి చెప్పింది. తనైతే ఎక్కడా చదువలేదు. అయినా సీ అసలయిన జవాబు. ఆ మేరకు తోటి విద్యార్థులకు సత్యం చిందే జ్ఞానం జాలువారే కంఠంతో సీ అని ఎలుగెత్తి చాటాడు. హాలు హాలంతా సీ కు టిక్కు పెట్టింది.

అయిదవ ప్రశ్న

5. రాముని అరణ్యవాసంలో అహర్నిశలు అతణ్ణి అంటిపెట్టుకుని వున్న అతని తమ్ముడు లక్ష్మణుని భార్య పేరేమి?

ఎ) ఊర్మిళ

బి) దేవయాని

సి) ఎవరూకాదు

కమఠాచార్యులు తానే తెలివి కలవాడనుకుంటున్నాడు. విద్యార్థుల మేధస్సును తక్కువ అంచనా వేస్తున్నాడు. నిజానికి లక్ష్మణుడుకి పెళ్ళి అయివుంటే అతను భార్యను విడిచి అడవులకెందుకు వెళతాడు. 'అడవిలో అన్న' అనుకోవటానికి ఇతనేమన్నా విప్లవకారుడా? మాయాబజారులో తాను ఆ్రలేడీ చూశాడు. లక్ష్మణకుమారుడు శశిరేఖను ఇష్టపడటం. అసలుపేరు లక్ష్మణ కుమార్ అయివుండవచ్చు. కమఠి దాన్ని లక్ష్మణుడిగా మార్చి వుంటాడు. కమఠి ప్రశ్న ఎంత కష్టంగా, కన్నింగ్‌గా, మిస్‌లీడింగ్‌గా ఇచ్చినా హంసలాగా తను అసలు జవాబును ఒక పక్కకు, తప్పుడు జవాబులు ఒక పక్కకు అవలీలగా నెట్టగలడు. కాబట్టి సీ అసలు జవాబు. సీ అనే కేక పెట్టాడు. హాలు హాలంతా సీ అంటూ రాగయుక్తంగా కోరస్‌గా అరిచి సీ కు టిక్కు పెట్టారు.

ఆరవ ప్రశ్న ఆఖరు ప్రశ్న వైపు విజయగర్వంతో చూశాడు.

6) లక్ష్మణుని భార్యయగు ఊర్మిళ రామునికేమగును?

ఎ) మరదలు.

బి) వదిన


సి) ఏమీకాదు.

చంటికి చిర్రెత్తుక వచ్చింది. వీడెవడ్రా బాబూ ఇలా తగులుకున్నాడు. వాడికి పెళ్ళే కాలేదురా అంటే వాడి భార్య రామునికేమవుతుందని అడుగుతాడు కమఠాచార్యుల లాంటి వాడే అయ్యుంటాడు... రామాయణం అంతా విని రాముకి సీతేమవుతుందని అడిగాడట. కమఠాచార్యుల లాంటి వాళ్ళు పరీక్షపేపరు తయారుచేస్తే తనలాంటి మేధావి కుర్రాళ్ళు తట్టుకోగలరు కానీ అటూ ఇటూ కానీ అర్భకపు వెధవల గతి ఏమి కావాలి. తెలివిలేని కుర్రాళ్ళని తలుచుకుని చంటి జాలితో కన్నీరుపెట్టాడు. కర్తవ్యం గుర్తుకొచ్చి ''ఏమీకాదు'' సరయిన జవాబు.

''విద్యార్థి సోదరులారా ఏకంకండి సీ కు టిక్కు పెట్టండి. అని విద్యార్థి జాతికి సందేశం ఇచ్చాడు. హాలు హాలంతా సీ అనర్చింది. పరీక్ష హాలు బయట

అభ్యర్థులంతా విజయోత్సాహంతో సీ అని అరుస్తూ కొంతమంది అభినందనపూర్వక ఆలింగనాలు చేసుకోగా మరికొందరు ఆనందనృత్యాలు చేశారు.

ఈ గుంపు రోడ్డు మీద కొచ్చేసరికి ఒక యాభై మంది వేటకొడవళ్ళు, కత్తులతో కనిపించారు. ఆ గుంపు ముఖ్యమంత్రిగారి ప్రైవేటు సైన్యం. ఈ మధ్య హత్యలు చేయక, ఊరికే తిని కూచోవటంతో వాళ్ళకు తమ విద్య మరిచిపోతామేమో, కళాకౌశలం తగ్గిపోతుందేమోననే భయం పట్టుకుంది. ఎంత నిపుణుడైన కళాకారుడైనా తన కళను తపస్సులా భావించి నిత్యం పనిముట్టు వదలకుండా పరిశ్రమించాలి. ఆ మాటే ముఖ్యమంత్రితో అంటే "అబ్బే మీరెవరినీ చంపే అవసరంలేదయ్యా ఆ పనికి మనకు- పోలీసులున్నారు." అని వాళ్ళ ఉత్సాహం మీద నీళ్ళు జల్లాడు. ముఖ్యమంత్రినని సంప్రదించకుండా ఈరోజు సైన్యాధిపతి వీధుల్లో కవాతు నిర్వహించాడు. అలా వెళుతున్న సైన్యం కంటపడ్డాడు చంటి. " అద్గో ప్రతిపక్షి కొడుకు. పొట్టిపందిలా ఎట్లున్నాడో చూడండి ఏసెయ్యండి నా కొడుకును." అని అరిచాడు. వాళ్ళను చూసి భయపడ్డ చంటి వెనక్కు పరీక్ష హాలు వేపు పరిగెత్తాడు. కానీ అక్కడి టీచర్లు – సిబ్బంది మానవ హారంలా నిల్చొని ముక్తకంఠంతో "ఏం బాబూ మీ అయ్య పోలింగు కాగానే బేలట్ బాక్సులు ఎత్తుకెళతాడు. నువ్వేమో ఎగ్జామ్ కాగానే పేపర్లెత్తుకెళతావా?" నిన్ను ససేమిరా లోపలికి రానివ్వం. పైగా నిన్ను బంధించి అగ్గో ఆరోడ్డు మీద వాళ్ళకప్పచెబుతాం." అన్నారు. చంటి మళ్ళ రోడ్డుమీదకెళ్ళేసరికి సైన్యం వెళ్ళిపోయింది. చంటి సంతోషంగా "బతికుంటే బలుసాకు తినొచ్చు. పలుమార్లు పరీక్ష రాయొచ్చు." అనుకుంటూ ఇంటి ముఖం పట్టాడు.




పరీక్ష ఫలితాలొచ్చాయి. చంటితో పాటు ఆ హాల్లో అందరూ శీతాకాలంలో చెట్ల ఆకుల్లా రాలిపోయారు. అల్లో లక్ష్మణా అంటూ గగ్గోలు పెడుతున్నారు. ప్రతిపక్షి భార్య విడాకులకు రంగం సిద్ధం చేసింది. లాయరు ఇంటికొచ్చాడు. ఒక టీవీ ఛానెల్ ప్రతినిధి కెమెరాతో సహా దిగాడు. అప్పుడే ఇంట్లోకి ప్రవేశిస్తున్న ప్రతిపక్షి భోరుమని ఏడుస్తూ భార్య కాళ్ళూ, లాయరు కాళ్ళూ పట్టుకొన్నాడు. టీవీ ప్రతినిధి కోపంగా "మరి నా కాళ్ళు" అని అరిచాడు. దాంతో అతని కాళ్ళు కూడా పట్టుకుని వాళ్ళిద్దరికీ తలాకాసిన్ని కట్టలు ముట్టచెప్పి తరిమేశాడు. తర్వాత మళ్ళీ ధారాపాతంగా కన్నీరు కారుస్తూ భార్యని ఈ ఒక్కసారి ఆగమని, ప్రభుత్వాన్ని ముప్పతిప్పలు పెట్టకుంటే తనను ఆమె భర్తగా భావించనక్కర్లేదని ప్రతిజ్ఞ చేశాడు. కొడుకు మాత్రం కంప్యూటర్ ముందు కూర్చుని రుద్ధ కంఠంతో "ఇదంతా కమఠాచార్యుల కుట్ర నాన్నా..." అన్నాడు. వాడి ముఖంలో వెలుగుతున్న జ్ఞాన జ్యోతుల్ని చూస్తూ పరవశంగా అరమోడ్చిన కళ్ళతో "నువ్వేమీ భయపడకు నాన్నా నేను చూసుకొంటాగా.." అన్నాడు.

మర్నాడు పేపర్లో క్రికెట్ బంతి సైజు అక్షరాల్లో 'విద్యాశాఖ అసమర్థత. ఒక్క హాల్లోనే వందమంది అభ్యర్థుల అపజయం. ఊహకందని ప్రశ్నాపత్రం.' అంటూ వార్తలొచ్చాయి. ప్రతి టీవీ ఛానెల్లోనూ ప్రతిపక్షి ప్రసంగాలే. ప్రశ్నాపత్రం విద్యార్థుల మానసిక మేధోస్థాయిలను మించి వుందని మీదు మిక్కిలి అభ్యర్థులను తప్పుదోవ పట్టించేలాగుందని, తప్పుడు సమాధానాలను ఎంపిక చేసుకోవటానికి దోహదపడ్డదని ఉద్ఘాటిస్తున్నాడు.

చంటి తన ముందు ఛానెల్‌వాళ్ళు పెట్టిన మైకులో తను అన్నీ సరయిన జవాబులే రాశాననీ " కమఠాచార్యులు మాత్రం ప్రశ్నాపత్రం ఇంతకంటే సులువుగా ఇవ్వటం తనకే కాదు అతల వితల సుతల తలాతల రసాతల లోకాల్లోని ఏ ప్రాణికీ సాధ్యంకాదని సాక్షాత్తూ ప్రతిపక్షికి కూడా ఇలా పేపరివ్వటం అతడు ఏడు జన్మలెత్తినా సాధ్యంకాదని వివరణ ఇచ్చాడు. తనకూ చంటికి ఎలాంటి అభిప్రాయ భేదాలు లేవనీ, చంటికీ, తనకూ శత్రుత్వం వుందని ఎవరైనా అంటే అది ఆధారరహితమైన వ్యాఖ్యగా తాను కొట్టి పారేస్తానని అన్నాడు. నిజానికి చంటిని తాను ప్రత్యక్షంగా చూడలేదని, కానీ వాళ్ళూ వీళ్ళూ చెప్పుకునేదాన్నిబట్టి అతను 'హ్రాంస్వకిటి' అనగా వాడుకభాషలో పొట్టిపందిలాగా వుంటాడని తెలుసుకున్నానని, అతను ఎలాగున్నా తనకభ్యంతరంలేదని, తాను కూర్మావతారానికి అతను వరహావతారానికి ప్రతినిధులుగా భావించిసర్దుకుపోవటానికి తనతో సమానగౌరవం ఇవ్వటానికి ఏ విధమయిన అడ్డంకులు లేవని చెప్పాడు. దాంతో పెద్ద గోల లేచింది. ఫెయిలయిన విద్యార్థుల తల్లిదండ్రులూ, వాళ్ళ బంధువులు, ఇరుగుపొరుగువాళ్ళు రాత్రికి రాత్రే ప్రతిపక్ష పార్టీకి తమ మద్దతు ప్రకటించారు. ప్రతిపక్షి రోడ్డు షోలు జనాన్ని విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. మంత్రులు తలలు పట్టుకున్నారు. అవతలిపక్షం విమర్శలకు అంతులేకుండా పోయింది. విద్యామంత్రికి బీపీ బాగాపెరిగింది. దాంతో టీవీలో కనబడి ఒక ఛాలెంజ్ చేశాడు. కమఠాచార్యులకంటే ఈజీగా ఎవరైనా ప్రశ్నాపత్రం ఇస్తే తను మంత్రి పదవికే కాక, తన శాసనసభా సభ్యత్వానికి రాజీనామా చేస్తాడు. అలా చేయలేని పక్షంలో ప్రతిపక్షి రాజీనామా చేయాలి. ముఖ్యమంత్రి వారించినా విద్యామంత్రి పెడచెవిన పెట్టాడు. ప్రతిపక్షి సవాలు తనకు సమ్మతమేనని తొడకొట్టి బస్తీమేసవాల్ అన్నాడు. మర్నాడే ప్రతిపక్షం మేధావి మినాచార్యులు చేసిన ప్రశ్నాపత్రం పేపర్లో వచ్చింది.

1) రామ –రావణ యుద్ధం ఎవరెవరి మధ్య జరిగింది?

ఎ) రాముడు – రావణుడు

బి) కోదండరాముడు – దశకంఠుడు

సి) అయోధ్యాపతి – లంకాపతి

2) అట్లు వారిద్దరిమధ్య జరిగిన యుద్ధంలో గెలిచినదెవరు?

ఎ) దశరథనందనుడు

బి) సీతాపతి

సి) జానకిరాముడు

ఈ ప్రశ్నాపత్రం చూసి కొంతమంది ఆనందనృత్యాలు చేశారు. మరికొంతమంది వాళ్ళ పిల్లల బంగారు భవిష్యత్తును వూహించి వూహల్లోనే సొమ్మసిల్లారు. విద్యామంత్రి ఆడిన మాట తప్పకుండా రాజీనామా చేశాడు. ఖాళీ అయిన స్థానానికి అధికార ప్రతిపక్ష పార్టీలు తమ తమ అభ్యర్థుల్ని నిలబెట్టాయి. రెండు పార్టీల ఎన్నికల మేనిఫెస్టో ఇంచుమించు ఒకటే. ప్రతికుర్రాడు ఈజీగా పరీక్షలు పేసయ్యి విదేశాలకు ఎగిరిపోవచ్చు. ఫలితాలొచ్చాయి. ప్రతిపక్షపార్టీ అభ్యర్థి గెలిచాడు.

ఆ రాత్రి ముఖ్యమంత్రి ప్రతిపక్షికి ఫోను చేసి "ఇదేమీ బాగులేదు. అమాయకుడిని రెచ్చగొట్టి రాజీనామా చేయిస్తావా? ఇలాంటి చెడ్డబుద్ధి మా ఇంటా వంటా లేదు." అన్నాడు.

"ఇదో ముఖ్యమంత్రి మనం కబడ్డీ ఆటాడుతున్నాం మమ్మల్ని పట్టాలని మీరూ, మిమ్మల్ని పట్టాలని మేమూ నిత్యం ప్రయత్నిస్తునే వుంటాం. అయితే ఒకటి. మనలో ఎవరు ఒక గేము గెలిచినా, రెండో గేముకు మన రెండు టీములే హోదాలో వుంటాయి. కాకపోతే కోర్టుమారతాం." ధర్మ సూక్ష్మం చెప్పాడు.

"సరేకానీ మీ వాడికి కంప్యూటరొచ్చన్నావుగా ఏమొచ్చు జావానా, ఒరాకిల్లా, ఎమ్మెస్ ఆఫీసా ఇంకా మన్నోమసినాకులో ఏమొచ్చో చెప్పు. వాడికి నచ్చిన విదేశానికి తోసేద్దాం."

ప్రతీపక్షి నీళ్ళు నములుతూ అటూ ఇటూ చూసి "అదా..అది మా వాడికి కంప్యూటర్ గేములో పేకాట మాత్రమే వచ్చు."

★